సదస్సులో పాల్గొన్న వక్తలు

జీఎస్టీ చట్టంపై అవగాహన అవసరం

వ్యాపారులకు జస్టిస్ భుయాన్ సూచన

తెలుగు యూనివర్సిటీ, మార్చి 23: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టంపై వ్యాపారులు అవగాహన పెంపొందించుకోవాలని, ఆ చట్టంలోని నిబంధనలకు కట్టుబడుతూ ప్రభుత్వానికి సహకరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సూచించారు. 'లీగల్ ఎథికల్ డైమెన్షన్స్ ఆఫ్ టాక్సేషన్' అనే అంశంపై ఏఐఎఫ్‌టీపీ-ఎస్‌జెడ్, టీటీపీఏ, ఫ్యాప్సీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యాప్సీ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. జీఎస్టీ చట్టంలోని పలు సెక్షన్లు, వివిధ తీర్పుల గురించి వివరించారు. చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపకరిస్తాయని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు.

రాష్ట్ర హైకోర్టుకు మరో ఇద్దరు న్యాయమూర్తులు

26, 28 తేదీల్లో ప్రమాణం చేయించనున్న సీజే

హైదరాబాద్, మార్చి 23, (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. వీరిలో జస్టిస్ సుజయ్‌పాల్‌తో ఈ నెల 26న, జస్టిస్ మౌసమీ భట్టాచార్యతో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించనున్నారు.

కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే (సర్కస్) గ్రౌండ్‌లో శనివారం 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటో షోను తిలకించేందుకు వచ్చిన ప్రజలు

కరీంనగర్‌లో ఆటోషోకు విశేష స్పందన

- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో మొదలైన ప్రదర్శన
- వివిధ కంపెనీల సరికొత్త వాహనాలు తిలకించేందుకు తరలివచ్చిన జనం
- సద్వినియోగం చేసుకోవాలి : గంగుల

కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే (సర్కస్) గ్రౌండ్‌లో 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటో షోను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్. చిత్రంలో నగర మేయర్ వై సునీల్‌రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రాంచ్ మేనేజర్ ప్రకాశ్‌రావు

కమాన్‌చౌరస్తా, మార్చి 23: కరీంనగర్ జిల్లా కేంద్రంలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఆటో షోకు ఆదరణ లభించింది. నగరం నడిబొడ్డున ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే (సర్కస్) గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ షోను శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మేయర్ వై సునీల్‌రావు, నమస్తే తెలంగాణ అడ్వటైజ్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్‌రావు, కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్రాంచ్ మేనేజర్ ప్రకాశ్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వాహన స్టాల్స్‌ను పరిశీలించి వాటి గురించి తెలుసుకున్నారు. ఎలక్ట్రిక్ వాహనాన్ని ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్‌రావు నడిపి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ.. మార్కెట్‌లో టాప్ బ్రాండ్‌లకు మంచి గిరాకీ ఉన్నదని, పెద్ద సంఖ్యలో ప్రజలు ఇంపోర్టెడ్ వాహనాలను తెప్పించుకుంటున్నారని చెప్పారు. అలాంటి అన్ని రకాల వాహనాలు జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేసిన 'నమస్తే తెలంగాణ' మరోసారి ప్రజల మన్ననలు పొందిందని తెలిపారు. బెంజ్, వోల్వో వంటి పెద్ద వాహనాలు నగరంలో ప్రదర్శనకు రావడం మంచి విషయమని చెప్పారు. ఈ రోజుల్లో ప్రతి కుటుంబం కారు ఉండాలని కోరుకుంటున్నదని, అలాంటి అన్ని వర్గాలకు అవసరమైన వాహనాలు ఈ షోలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని వీక్షించి, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందుబాటులో నగరం నడిబొడ్డున 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో వాహనాల ప్రదర్శన ఏర్పాటు చేయడం శుభపరిణామం అని చెప్పారు. నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మెనేజర్ ఎన్ సురేందర్‌రావు మాట్లాడుతూ.. వాహనాలు కొనాలనుకునేటప్పుడు కొందరు స్టైల్ చూస్తారని, మరికొందరు మైలేజ్, సేఫ్టీ, డబ్బులు చూస్తారని, అలాంటి అన్ని వర్గాలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చేందుకు 'నమస్తే తెంగాణ' ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇక్కడికొచ్చిన వినియోగదారులకు, పాఠకులకు అన్ని రకాల వాహనాలు అందుబాటులో ఉండటంతోపాటు, వారి బడ్జెట్‌లో ఎలాంటి వాహనాలు వస్తాయి? రుణ సదుపాయం ఎలా ఉంటుంది? అని తెలిపేందుకు బ్యాంకులు ఇక్కడే ఉన్నాయని తెపారు.

లోకం పోకడ

అక్కడ తాజ్‌మహాల్ ఉన్నచోట ఆగ్రా అని చెప్పాను గదా.. ఇటు బీచ్ పక్కనున్నది చెన్నై.. అటు ఎండిన పొలాలు, ఖాళీ బిందెలున్నాయి గదా, అది తెలంగాణ!

సామాజిక సమతూకం

మొదటిపేజీ తరువాయి...

కల్పించారు. బీసీలకు 5 పార్లమెంట్ స్థానాల్లో పోటీచేసే అవకాశాన్ని కల్పించారు. బీసీల్లోనూ మున్నూరుకాపులకు రెండు (జహీరాబాద్, నిజామాబాద్) పార్లమెంట్ స్థానాలు కేటాయించగా, చేవెళ్ల స్థానాన్ని ముదిరాజ్‌లకు, సికింద్రాబాద్‌ను గౌడ సామాజికవర్గానికి, భువనగిరి స్థానాన్ని యాదవులకు కేటాయించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, మల్కాజిగిరి స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారు. వెలమ, కమ్మ సామాజిక వర్గానికి ఒక్కో సీటును కేటాయించారు. రిజర్వ్ స్థానాల్లోనూ సమాన అవకాశాలు కల్పించారు. ఎస్టీల్లో ఆదివాసీ, మైదాన గిరిజనులకు సమానంగా సీట్లు ఇచ్చారు. ఆదిలాబాద్ స్థానాన్ని ఆదివాసీ (గోండు) గిరిజనులకు కేటాయించగా, మహబూబాబాద్ స్థానాన్ని మైదాన ప్రాంత గిరిజన (బంజారా/లంబాడా) గిరిజనులకు కేటాయించటం విశేషం. ఎస్సీ నియోజకవర్గాల్లో రెండు స్థానాలను మాదిగ (నాగర్‌కర్నూల్, వరంగల్)లకు, పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని మాల సామాజిక వర్గానికి కేటాయించారు. తాజాగా, శనివారం మూడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను కేసీఆర్ ఖరారు చేశారు. సికింద్రాబాద్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, భువనగిరి నుంచి పార్టీ సీనియర్ నేత క్యామ మల్లేశ్, నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని పార్టీ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు ఇతర ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాలు తీసుకొని.. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పార్టీకి విధేయుడిగా ఉన్న పద్మారావుగౌడ్‌ను ఖరారు చేయగా, సభ్యులంతా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. పద్మారావుగౌడ్ సికింద్రాబాద్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. నిబద్ధత కలిగిన స్థానిక నేత. బస్తీవాసులంతా 'పజ్జన్న' అని ప్రేమగా పిలుస్తారు. భువనగిరి, నల్గొండ పార్లమెంట్ నియోజకర్గాల నేతల అభిప్రాయాలను సేకరించిన కేసీఆర్.. భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నల్లగొండ స్థానం నుంచి కంచర్ల కృష్ణారెడ్డిని ప్రకటించారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, పార్టీ హైదరాబాద్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది ఒక్క సీటే

రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా, ఇప్పటి వరకు 16 స్థానాలకు అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించారు. ఇక మిగిలింది హైదరాబాద్ ఎంపీ స్థానం ఒక్కటే. కాగా, భువనగిరి స్థానం నుంచి పోటీచేసే అవకాశం కల్పించినందుకు కేసీఆర్‌కు క్యామ మల్లేశ్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తదితరులతో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

లోక్‌సభ స్థానం	బీఆర్‌ఎస్ అభ్యర్థి
ఆదిలాబాద్ (ఎస్టీ)	ఆత్రం సక్కు
మల్కాజిగిరి	రాగిడి లక్ష్మారెడ్డి
ఖమ్మం	నామా నాగేశ్వర్‌రావు
మహబూబాబాద్ (ఎస్టీ)	మాలోత్ కవిత
కరీంనగర్	బోయినపల్లి వినోద్ కుమార్
పెద్దపల్లి (ఎస్సీ)	కొప్పుల ఈశ్వర్
మహబూబ్‌నగర్	మన్నె శ్రీనివాస్‌రెడ్డి
చేవెళ్ల	కాసాని జ్ఞానేశ్వర్
వరంగల్ (ఎస్సీ)	కడియం కావ్య
జహీరాబాద్	గాలి అనిల్‌కుమార్
నిజామాబాద్	బాజిరెడ్డి గోవర్ధన్
సికింద్రాబాద్	పద్మారావుగౌడ్
నాగర్‌కర్నూల్	ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
భువనగిరి	క్యామ మల్లేశ్
నల్లగొండ	కంచర్ల కృష్ణారెడ్డి
మెదక్	వెంకట్రామిరెడ్డి

ఒరిజినల్ కాంగ్రెసోళ్లకు అపాయింట్‌మెంటే ఇస్తలేదు

మొదటిపేజీ తరువాయి...

వరకు బీఆర్‌ఎస్ నేతలను విమర్శించి, ఇప్పుడు వారిని ఎందుకు చేర్చుకుంటున్నారు? ఆయన చుట్టూ మొత్తం భజనపరులు చేరారు. ఆయనను కలవటానికి తమకు అపాయింట్‌మెంటే ఇవ్వటం లేదు. నేను 15 సార్లు అడిగినా ఇవ్వలేదు. ఇలా ఒరిజినల్ కాంగ్రెస్‌వాళ్లకు అన్యాయం చేయొద్దు' అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంతే స్వయంగా ఇతర పార్టీ నేతల ఇండ్లకు వెళ్లి వాళ్లను పార్టీలోకి ఆహ్వానించటంపై వీహెచ్ ఫైర్ అయ్యారు. సీఎంగా స్థాయిని ఆయనే తగ్గించుకుంటున్నారని విమర్శించారు. వాళ్లు మన దగ్గరికి రావాలి గానీ, వాళ్ల వద్దకు వెళ్లటమేమిటని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పూర్తిగా వన్‌సైడే వింటున్నారని, తమ మాట కూడా వినాలని అన్నారు. తాను కూడా పార్టీలో సీనియర్ అని, సీఎం పదవి రెండుసార్లు తన దగ్గరికి వచ్చి పోయిందని చెప్పారు. 'నువ్వెంత పాపులరో.. నేను నీ కన్నా ఎక్కువ పాపులర్' అని రేవంత్‌నుద్దేశించి అన్నారు. పార్టీ కోసం ఎంతో చేశానని, అప్పుడున్న అవసరం ఇప్పుడు లేదా? అని నిలదీశారు. ఇప్పటికైనా రేవంత్‌లో మార్పు రావాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని తెలిపారు. టికెట్ కేటాయింపులపైనా మండిపడ్డారు. ఒకరి ఇంట్లో రెండు, మూడు టికెట్లు ఇవ్వటం ఏమిటి? అని ప్రశ్నించారు.

ఢిల్లీలో శనివారం రౌస్ ఎవెన్యూ కోర్టుకు కవితను కారులో తీసుకొస్తున్న ఈడీ అధికారులు

తప్పుడు కేసుపై పోరాడుతా

- అభియోగాలన్నీ నిరాధారమే
- ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలి
- కోర్టు వద్ద మీడియాతో ఎమ్మెల్సీ కవిత
- మరో మూడు రోజులు కస్టడీ పొడిగింపు
- 26న మళ్లీ కోర్టు ముందు హాజరు
- అదే రోజున బెయిల్‌పై విచారణ

ఢిల్లీ, మార్చి 23: తనపై మోపిన అభియోగాలన్నీ నిరాధారమైనవని, తప్పుడు ఆరోపణలతో అరెస్టు చేశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈడీ కస్టడీలో ఉన్న కవిత శనివారం రౌస్ ఎవెన్యూ కోర్టుకు వెళ్తున్న సందర్భంగా అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఢిల్లీ ప్రభుత్వ మద్య విధానం పేరుతో తనపై మోపిన కేసు కేవలం రాజకీయ ప్రేరేపితమైనదని చెప్పారు. కల్పిత, కట్టుకథలతో పెట్టిన అక్రమ కేసు అని విమర్శించారు. కస్టడీలో ఉన్న తనను ఈడీ అధికారులు ఇప్పటివరకు అడిగిందే అడుగుతున్నారని, విచారణలో కొత్తగా ఏమీ లేదని తెలిపారు. ఈడీ పెట్టిన అక్రమ కేసుపై న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. దేశంలో ఒకపక్క ఎన్నికలు జరుగుతుంటే మరోపక్క కేంద్ర ఆధీనంలోని ఈడీ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమని అన్నారు. ఎన్నికల సమయంలో ఉద్దేశపూర్వకంగా కొన్ని రాజకీయ పార్టీలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న ఈ అరెస్టులపై ఎన్నికల సంఘం కూడా దృష్టిసారించాలని ఆమె విజ్ఞప్తిచేశారు. దేశ ప్రజలు ఈ అరెస్టులపై ఆలోచించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు.

26 వరకు కస్టడీలోనే కవిత

ఢిల్లీ మద్యం విధానం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. ఈ నెల 16న వారం రోజులపాటు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో ఈడీ అధికారులు శనివారం ఆమెను రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. కవితను మరో ఐదురోజులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరారు. మరో మూడు రోజుల కస్టడీకి మాత్రమే అంగీకరించిన కోర్టు ఈ నెల 26న ఉదయం 11 గంటలలోగా కవితను తమ ముందు హాజరుపరచాలని ఆదేశించింది. కవితను విచారించే విషయంలో జాప్యం ఉండకూడదని, అంతా సీసీ కెమెరాల ముందు జరగాలని, ఆ సీసీ ఫుటేజీని భద్రపరచాలని పేర్కొన్నది. ఆమెకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని తెలిపింది. ఆమెకు ఇంటి భోజనాన్ని అనుమతించాలని, కోర్టు నిర్ణయించిన వేళల్లో కుటుంబ సభ్యులను, న్యాయవాదులను కలుసుకొనేందుకు అనుమతించాలని ఈడీని ఆదేశించింది.

26న బెయిల్‌పై విచారణ

కవిత దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 26న విచారణ జరుపుతామని కోర్టు ప్రకటించింది. కవిత ఆస్తులు, ఆదాయపు పన్ను వంటి పత్రాలు ఇవ్వాలని ఈడీ కోరుతున్నదని, ఆమె కస్టడీలో ఉండగా వాటిని ఎలా ఇవ్వగలరని న్యాయవాది నితేశ్‌రాణా ప్రశ్నించారు. పత్రాలు కావాలని ఈడీ మౌఖికంగా కోరుతున్నదని తెలిపారు. కవితకు బెయిల్ మంజూరయ్యే వరకు ఆ పత్రాలు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. కవిత విచారణ అయ్యిందని, కస్టడీని పొడిగించాల్సిన అవసరం లేదని చెప్పారు. దీనిపై ఈడీ తరపు న్యాయవాది జోసెబ్ హుస్సేన్ ప్రతివాదన చేస్తూ, కవిత నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి వున్నదని, కస్టడీని ఐదు రోజులు పొడిగించాలని కోరారు. వాదనల అనంతరం సీబీఐ కోర్టు, ఐదు రోజుల కస్టడీకి నిరాకరిస్తూ.. ఈ నెల 26 వరకే కస్టడీని పొడిగించింది. ఈ నెల 16న జారీ చేసిన ఉత్తర్వుల్లోని షరతులన్నీ అ మల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

కవిత ఆడపడుచు ఇంట్లో ఈడీ సోదాలు

ఈడీ అధికారులు శనివారం మాదాపూర్‌లోని కవిత ఆడపడుచు ఇంట్లో సోదాలు చేపట్టారు. ఉదయం 6 నుంచే ఏడుగురు ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఆ అపార్ట్‌మెంట్‌లోని మూడో ఫ్లోర్‌లో గతంలో కవిత కొంతకాలంపాటు కుటుంబంతో కలిసి ఉన్నారు. ఇటీవల ఆమె ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఈడీ అధికారులు.. వాటిలో లభించిన సమాచారం మేరకు సోదాలు జరిపినట్టు తెలిసింది.

మొక్కవోని ధైర్యంతో కవిత

కవిత కస్టడీ కేసు విచారణ జరిపిన కోర్టు హాలు మీడియా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, కుటుంబసభ్యులతో కిటకిటలాడింది. కవిత భర్త అనిల్, కుమారులు ఆదిత్య, ఆర్య కూడా కోర్టుకు వచ్చారు. కోర్టు అనుమతితో కవిత వారందరినీ కలిసి పలకరించారు. కొందరు కన్నీళ్లు పెట్టుకోవడాన్ని చూసిన కవిత అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఎంపీ మాలోతు కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, కొందరు కుటుంబ సభ్యులు కన్నీళ్లు పెట్టుకోవడంతో వారందరినీ దగ్గరకు తీసుకున్న కవిత ధైర్యం చెప్పారు. ఇంతమంది అభిమానులు ఉండగా తనకేమీ కాదంటూ అందరినీ పేరుపెట్టి పలకరించారు. ఇద్దరు కుమారులతో నవ్వుతూ మాట్లాడారు. కోర్టు ఇచ్చిన గడువు పూర్తవ్వడంతో అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కవితను కలిసినవారిలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తదితరులున్నారు.

డమ్మీ కాంగ్రెస్!

మొదటిపేజీ తరువాయి...

మొదటి నుంచి పనిచేస్తున్నవారిని కాదని, ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి టికెట్లు కేటాయించటం ఏమిటి? అని, ఇదే కొనసాగితే ఎన్నికల్లో ఘోరపరాభవాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. అదే సమయంలో బీజేపీతో సీఎం రేవంత్ టచ్‌లో ఉన్నారని తెలంగాణ ఉద్యమకారుడు, బుద్ధిజీవుడైన గాదె ఇన్నయ్య లాంటి వాళ్లు చేసిన ఆరోపణలు మరింత అగ్గిరాజేసినట్టు అవుతున్నది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థులు, అవే స్థానాల్లో బీజేపీ బరిలో నిలిపిన అభ్యర్థులను పోలి కపెడుతూ రేవంత్‌పై జోరుగా ప్రచారం సాగుతున్నది. ఒక్కో నియోజకవర్గాన్ని పరిశీలిస్తే..

చేవెళ్ల

చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రకటించింది. ఇదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఖరారయ్యారు. కాంగ్రెస్‌లో చేరక ముందు రంజిత్‌రెడ్డిని 'గుండోడా.. గుడ్డోడా' అని బహిరంగసభ వేదికల నుంచే నిప్పు లు చెరిగిన రేవంత్‌రెడ్డి.. అదే అభ్యర్థిని ప్రకటించటం వెనుక బలమైన కారణం ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. బీఆర్‌ఎస్ ఇక్కడ గెలవాలంటే 'ఈ సారి అభ్యర్థిని మారిస్తే మంచి ఫలితం ఉంటుంది' అని అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ విషయం తెలిసే రంజిత్‌రెడ్డిని రేవంత్ తమ పార్టీలోకి ఆహ్వానించారని, తన పూర్వమిత్రుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మేలు చేసేందుకేనని ప్రచారం సాగుతున్నది.

నాగర్‌కర్నూల్

సీఎం, డిప్యూటీ సీఎం మధ్య నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నలిగిపోయిందని, అందుకు అభ్యర్థే కారణమనే చర్చ సాగుతున్నది. ఈ నియోజకవర్గంలో మాదిగ సామాజికవర్గ ఓట్లే ఎక్కువ. మాల సా మాజిక వర్గానికి చెందిన మల్లు రవికి టికెట్ కేటాయించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌కు మేలు చేసేందుకే హైకమాండ్‌కు రేవంత్ ఈ ఒక్క పేరునే సిఫార్సు చేశారనే ఆరోపణలున్నాయి.

సికింద్రాబాద్

సికింద్రాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానం. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నారు. ఇక్కడ కిషన్‌రెడ్డికి పోటీగా బీఆర్‌ఎస్ నుంచి నాలుగు రోజుల క్రితమే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు టికెట్ ఇచ్చారు. పీజేఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు చేసిన దానంకు ఇప్పుడు ఆ నియోజకవర్గమే సహకరించే పరిస్థితి లేదనే ప్రచారం సాగుతున్నది. అటువంటిది ఆయనకు లోక్‌సభ టికెట్ ఇప్పించటం తన పూర్వమిత్రుడు కిషన్‌రెడ్డిని గెలిపించేందుకే అని కాంగ్రెస్‌లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెదక్

మెదక్ లోక్‌సభ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును బీజేపీ బరిలో నిలిపింది. అక్కడ కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును బరిలో నిలుపుతారని ప్రచారం సాగింది. కానీ, ఉన్నఫలంగా నీలం మధుకు టికెట్ ఇవ్వబోతున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. బలమైన క్యాండిడేట్‌ను పెడితే ఓట్లు చీలిపోయి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచే అవకాశం ఉంటుందని, అందుకే బలహీనమైన అభ్యర్థిని నామమాత్రంగా నిలబెట్టి బీజేపీ అభ్యర్థిని గెలిపిచేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

మల్కాజిగిరి

మల్కాజిగిరి స్థానం నుంచే గత ఎన్నికల్లో రేవంత్ ఎంపీగా గెలిచారు. ఈ స్థానం ఆ పార్టీకి చాలా ముఖ్యం. కానీ, నియోజకవర్గానికే పరిచయం లేని వ్యక్తిని బరిలో నిలపటం వెనుక భారీ మంత్రాంగమే ఉన్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ప్రయోజనం కలిగించేందుకే తమ పార్టీ సీనియర్లు, సమర్థులను కాదని సునీతామహేందర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

బీజేపీకి సహకారం కాంగ్రెస్‌కు అలవాటే!

2019 ఎన్నికల నుంచి ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య సహకార ఒప్పందం కొనసాగుతున్నదని, అందుకు లోగడ జరిగిన ఎన్నికల ఫలితాలే సాక్ష్యమని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్ స్థానాల్లో కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా సహకరించటం వల్లే ఆ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారనే విమర్శలు ఉన్నాయి. హుజూరాబాద్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలిపిందని ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదంలో రాజ్యాంగ విలువలు

'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఫ్రీడమ్'లో ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ): దేశంలో మతద్వేషాలు పెట్రేగుతున్నాయని, రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడుతున్నాయని ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. జనగణమన అభియాన్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని లామాఖాన్‌లో నిర్వహించిన 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఫ్రీడమ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామిక హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, లౌకిక తత్వం, సౌభ్రాతృత్వం మన రాజ్యాంగంలోని ముఖ్య విలువలని, గత పదేండ్ల నుంచి ఈ విలువలన్నీ ప్రమాదంలో పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేసేందుకు బీజేపీ, ఆరెస్సెస్ కంకణం కట్టుకున్నాయని ధ్వజమెత్తుతూ.. ఇలాంటి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'రాజ్యాంగ విలువలను, మత సామరస్యాన్ని కాపాడుకోవడంలో పౌరుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, షార్ట్ వీడియో, నినాదాల పోటీలను నిర్వహించారు. 35 కాలేజీలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రొ. హరగోపాల్, ఖలీదా పర్వీన్ బహుమతులను అందజేశారు.

నేటి నుంచి భానుడి భగభగలు

పెరుగనున్న పగటి ఉష్ణోగ్రతలు



హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆదివారం నుంచి పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ దిశ నుంచి కిందిస్థాయి గాలులతో వచ్చే 5 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరుగుతాయని పేర్కొన్నది. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతుండగా, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 38.7, మెదక్ జిల్లా శివ్వంపేటలో 37.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు పెరగనున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఎండ వేడికి ప్రజలు ఎవరూ బయటికి రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

	గరిష్ఠం	కనిష్ఠం
మెదక్	40.2°c	20.2°c
రంగారెడ్డి	39.8°c	18.1°c
ఆదిలాబాద్	38.9°c	20.9°c
నల్లగొండ	38.5°c	24.0°c
మహబూబ్‌నగర్	38.0°c	24.5°c
నిజామాబాద్	37.9°c	22.9°c
హైదరాబాద్	37.5°c	23.6°c
ఖమ్మం	37.0°c	23.0°c
వరంగల్	37.0°c	24.0°c
కరీంనగర్	37.0°c	24.0°c

వాతావరణ శాఖ వ్యవస్థాపక వేడుకలు

వాతావరణ శాఖ 150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఐఎండీ వ్యవస్థాపక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వాతావరణ శాఖ సంచాలకుడు డాక్టర్ నాగరత్న అధ్యక్షతన జరిగిన సదస్సుకు పర్యావరణ వేత్త, వర్షపు నీరు ప్రాజెక్ట్ ఫౌండర్ కల్పనా రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాతావరణ మార్పులు, నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన కల్పనా రమేశ్, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన నీటిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు

మండే ఎండలకు అడవుల్లోని మూగజీవాలు తాగునీటికి తహతహలాడుతున్నాయి. దీంతో మెదక్ జిల్లా నర్సాపూర్ అటవీ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లు నిర్మించి సౌర పంపుసెట్ల ద్వారా వన్య ప్రాణుల దాహార్తిని తీరుస్తున్నారు. ఈ ప్రాంతంలో 11,700 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉన్నది. ఇక్కడ కోతులు, ఎలుగుబంట్లు, కొండ గొర్రెలు, కుందేళ్లు వంటి వన్య ప్రాణులు ఉన్నాయి. వేసవిలో ఆ జంతువులు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటాయి. బయటకు వెళ్లకుండా అడవిలోనే దాహార్తిని తీర్చడానికి శాశ్వత చర్యలు చేపట్టినట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బీ అంబర్‌సింగ్ వెల్లడించారు.